క్లుప్తంగా

ప్రభుత్వ కళాశాలల్లోనే చేరాలి


ప్రచారం చేస్తున్న గ్రామస్తులు

కుంటాల: నాణ్యమైన విద్య అందిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు చేరాలని కుంటాల గ్రామస్తులు పేర్కొన్నారు. బుధవారం కుంటాల గ్రామస్తుల ఆధ్వర్యంలో ప్రభుత్వ కళాశాలలో చేరాలని అంబకంటిలో ప్రచారం నిర్వహించారు. మండల కేంద్రంలో వసతులతో ఏర్పాటు చేసిన కళాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కె.కృష్ణారావు, జక్కుల గజేందర్, సక్రపు సురేశ్, తెడ్డు రమేశ్, కుర్ర నవీన్ ఉన్నారు.

'కోత విధించిన ధాన్యాన్ని రికవరీ చేయాలి'

ఖానాపూర్: భైంసాలోని ఓ రైస్‌మిల్లులో ఖానాపూర్ రైతుల నుంచి అక్రమంగా కోతలు విధించిన వరి ధాన్యాన్ని వెంటనే తిరిగి రికవరీ చేయాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి అల్లెపు పీటర్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఖానాపూర్ మండలంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు ఓ వైపు క్వింటాల్‌కు 5 కిలోలు కోత విధిస్తున్నప్పటికీ రైస్‌మిల్‌లోనూ మళ్లీ కోతలు విధించడాన్ని నిర్మూలించాలని కోరారు. ఈ ఘటనపై ప్రభుత్వం విచారణ చేసి చర్యలు తీసుకోకుంటే కలెక్టరేట్ ముందు నిరాహారదీక్షలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సురేందర్, మహమూద్, ప్రకాశ్ ఉన్నారు.

మామడలో క్రికెట్ పోటీలు


టోర్నమెంట్‌లో క్రీడాకారులు

మామడ: మండల కేంద్రంలో బుధవారం సుంకిశాల చిన్నమ్మ–నారాగౌడ్ స్మారకార్థం క్రికెట్ పోటీలను మాజీ సర్పంచ్ హన్మాగౌడ్ ప్రారంభించారు. వివిధ ప్రాంతాల జట్లు పోటీలో పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. గెలుపొందిన జట్లకు షీల్డ్‌తోపాటు నగదు బహుమతిని అందించనున్నారు.

హైమాస్ట్ దీపాలకు మరమ్మతులు


మరమ్మతులు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఈద్గాం చౌరస్తాలో ఏర్పాటు చేసిన హైమాస్టు దీపాలు.. అసంపూర్తిగా వెలుగుతున్నాయి. దీంతో రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. వాహనదారుల ఫిర్యాదు మేరకు బుధవారం మున్సిపల్ అధికారులు హైమాస్టు దీపాలకు మరమ్మతులు చేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక


అధ్యక్షుడు శంకర్


కార్యదర్శి శ్రీనివాస్

ఖానాపూర్: సహకార భారతి అనుబంధ మ్యాక్స్ సొసైటీ ఖానాపూర్ మండల అడహక్ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు సహకార భారతి జిల్లా అధ్యక్షుడు భూసారపు గంగాధర్ తెలిపారు. పట్టణంలోని పీఆర్‌టీయూ భవన్‌లో ఆర్ఎస్ఎస్ జిల్లా సంఘచాలక్ నూకల విజయ్, సహకార భారతి జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, జిల్లా కోశాధికారి భీంరావు, జిల్లా ఉపాధ్యక్షుడు కిషన్‌రావు సమక్షంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఖానాపూర్ మండలాధ్యక్షుడిగా బిల్ల శంకర్, ఉపాధ్యక్షుడిగా జితేందర్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్, కోశాధికారిగా నర్సయ్య, సహాయ కార్యదర్శిగా సురేశ్, డైరెక్టర్‌గా ప్రభాకర్ ఎన్నికయ్యారు.

ఆపదలో 100కు డయల్ చేయండి

సోన్: ఆపదలో ఆందోళన చెందకుండా 100కు డయల్ చేయాలని షీ టీం సభ్యురాలు రమాదేవి అన్నారు. బుధవారం మండలంలోని న్యూవెల్మల్‌లో ఉపాధి హామీ కూలీలకు పని ప్రదేశంలో షీటీం సేవలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు సోషల్ మీడియాలో తమ ఫొటోలను అప్లోడ్ చేయొద్దని సూచించారు. ఏవరైనా వేధిస్తే ధైర్యంగా ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో షీటీం సభ్యులు రమ, లక్ష్మణ్, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

సాగు 'స్వర్ణ'మయం అయ్యేనా..?

- అధ్వానంగా స్వర్ణ ప్రాజెక్టు ఉపకాలువలు
- పిచ్చిమొక్కలు, పూడికతో నిండిన వైనం
- ఏళ్లుగా మరమ్మతులు కరువు
- సమస్య పరిష్కరించాలని రైతుల వేడుకోలు


సారంగపూర్ సమీపంలో బంధం చెరువు వద్ద..


యాకర్‌పెల్లిలో మధ్యకాలువ ఉపకాలువలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

సారంగపూర్: మండలంలోని స్వర్ణ ప్రాజెక్టు పరిధిలోని ఉపకాల్వలు అధ్వానంగా మారాయి. చెత్తాచెదారం, పిచ్చిమొక్కలతో నిండి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందడం లేదు. దీంతో పంటలకు సక్రమంగా నీరందక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. యాసంగిలో నష్టపోయామని.. ఇప్పటికైనా దెబ్బతిన్న ఉపకాల్వలకు మరమ్మతులు చేయించి పూడిక, పిచ్చిమొక్కలు తొలగించాలని రైతులు కోరుతున్నారు.

ప్రాజెక్టుకు మూడు ప్రధాన కాల్వలు..

స్వర్ణ ప్రాజెక్టు సారంగపూర్ మండలం స్వర్ణ గ్రామం నుంచి నిర్మల్ పట్టణం మీదుగా చెరువులకు అనుసంధానమై ఉంటుంది. స్వర్ణ ప్రాజెక్టుకు కుడి, మధ్య, ఎడమ అనే ప్రధాన కాల్వలున్నాయి. ఈ ప్రాజెక్టు ఆయకట్టు పరిధి పదివేల ఎకరాలు. నాలుగు కిలోమీటర్ల దూరం ఉండే కుడి కాల్వకు మూడు ఉపకాల్వలు, ఐదు కిలోమీటర్ల దూరం ఉండే ఎడమకాల్వలకు నాలుగు ఉపకాల్వలు, 16 కిలోమీటర్ల దూరం ఉండే మధ్యకాల్వకు 11 ఉపకాల్వలున్నాయి.

మధ్యకాల్వకు 11 ఉపకాల్వలు..

స్వర్ణ ప్రాజెక్టులోని మధ్యకాల్వ ఆయకట్టు పరిధి ఆరువేల ఎకరాలు. 16 కిలోమీటర్ల మేర ఉండే మధ్యకాల్వకు 11 ఉపకాల్వలున్నాయి. సారంగపూర్ మండలం స్వర్ణలో ఒకటి, మలక్‌చించోలిలో రెండు, సారంగపూర్‌లో రెండు, యాకర్‌పెల్లిలో నాలుగు ఉపకాల్వలు, బోరిగాంలో రెండు ఉపకాలువలు ఉన్నాయి. అన్ని గ్రామాల్లోని ఉపకాల్వలు అధ్వానంగా మారాయి. పిచ్చిమొక్కలు, మట్టితో పూడిక పేరుకుపోయాయి.

చిన్న, సన్నకారు రైతులే అధికం..

మధ్య కాల్వ కింద భూములు ఉన్న వారిలో చిన్న, సన్నకారు రైతులే అధికంగా ఉన్నారు. వీరంతా ఎకరం, ఎకరంన్నర, రెండెకరాల్లోపు భూములున్న రైతులే. సాగుభూములు ఎక్కువ ఉన్న రైతులు బోర్లు వేయించుకొని పంటలు పండిస్తున్నారు. కానీ అంతా చిన్న, సన్నకారు రైతాంగమే కావడంతో బోర్లు వేయించుకునేందుకు ఆర్థిక స్థోమత లేక లబోదిబోమంటున్నారు.

మరమ్మతులు చేయిస్తేనే చివరి ఆయకట్టుకు నీరు..

ఉపకాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు, పూడిక తొలగించి ధ్వంసమైన చోట మరమ్మతులు చేయించాలని రైతులు పేర్కొంటున్నారు. ఖరీఫ్‌లో పంటల సాగుకు సమయం సమీపిస్తుందని.. కనీసం అధికారులు స్పందించి ఉపాధిహామీ పథకం ద్వారానైనా ఉపకాల్వలను మరమ్మతులు చేయించేలా చర్యలు తీసుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

ప్రధాన కాలువలకే మరమ్మతులు చేయిస్తాం

స్వర్ణ ప్రాజెక్టు మూడు ప్రధాన కాలువలైన కుడి, ఎడమ, మధ్యకాలువల్లో పూడిక తీయించేందుకు రూ.10లక్షలతో టెండర్లు పిలుస్తున్నాం. ఎన్నికల కోడ్ ముగియగానే ప్రక్రియ ప్రారంభిస్తాం. ఉపకాలువలకు మాత్రం మరమ్మతులు చేయించే పరిస్థితి లేదు. ఉపాధిహామీ పథకం కింద రైతులు, సంబంధిత అధికారులు కలిసి చేయించుకోవాలి.

– మధుపాల్, జేఈ, స్వర్ణప్రాజెక్టు

సాగునీరందక నష్టపోయా



మధ్య కాలువ ద్వారా ఉపకాలువ నుంచి మా పొలానికి సాగునీరు వస్తుంది. కాలువ పూడిక, పిచ్చి మొక్కలతో పేరుకుపోవడంతో రబీలో సాగునీరు సక్రమంగా అందలేదు. ఎకరాకు 30 క్వింటాళ్ల దిగుబడి రావాల్సిన పంట.. నీరందక 18క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. దీంతో చాలా నష్టపోయాం.

– పెద్దిరెడ్డి, రైతు, యాకర్‌పెల్లి

మరమ్మతులు చేయించాలి



ఉపకాలువల్లో పూడిక, పిచ్చిమొక్కలు పెరగడంతో ఆయకట్టుకు నీరందక ఇబ్బందులు పడుతున్నాం. సమీప రైతుల బోరుబావుల నుంచి కొందరు తమ పంటలకు నీరు అందిస్తున్నా.. సరిపోవడం లేదు. యాసంగిలో నష్టపోయాం. ఖరీఫ్‌లో ఇబ్బందులు ఏర్పడకుండా కాలువలకు మరమ్మతులు చేయించాలి.

– రమేశ్, రైతు, కౌట్ల(బి)

సమష్టి సహకారంతోనే దుకాణాల తొలగింపు


వారసంత పరిశీలిస్తున్న చైర్మన్ సత్యం

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి 108 వాహనం వెళ్లకుండా రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన తాత్కాలిక దుకాణాలను సమష్టి సహకారంతోనే తొలగించామని మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం అన్నారు. పట్టణంలోని అంగడిబజార్‌లో రెండోరోజు వార సంతను సందర్శించి ప్రజల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ తరహాలోనే ప్రజలు సహకరిస్తే పట్టణాన్ని అభివృద్ధి చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కావలి సంతోష్, మాజీ వైస్‌చైర్మన్ అబ్దుల్ కలీల్, కౌన్సిలర్లు, నాయకులు కిశోర్ నాయక్, అమానుల్లాఖాన్, పరిమి సురేశ్, జన్నారపు శంకర్, షబ్బీర్‌పాషా, తదితరులు ఉన్నారు.

అధిక లోడ్‌తో వాహనాలను తీసుకెళ్లొద్దు

భైంసారూరల్: మండలంలోని కోతల్‌గాంలోని ధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి అధిక లోడుతో వాహనాలను తీసుకెళ్లవద్దని బుధవారం గ్రామస్తులు డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రం నుంచి వెళ్లే లారీలకు విద్యుత్ తీగలు తగిలి తమ ఇళ్లలోని ఎలక్ట్రికల్ పరికరాలు దగ్ధమవుతున్నాయని పేర్కొన్నారు. సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ప్రమాదాలు జరగక ముందే అధికారులు స్పందించి అధిక లోడ్‌తో వాహనాలను వెళ్లకుండా చూడాలని కోరారు.

విత్తనాలు జాగ్రత్తగా ఎంచుకోవాలి


తానూరు : సింగన్‌గాంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈవో సంఘవి

నర్సాపూర్(జి): రైతులు విత్తనాల ఎంపికలో జాగ్రత్త వహించాలని క్లస్టర్ ఏఈఓ రమ్య పేర్కొన్నారు. మండలంలోని తురాటి గ్రామపంచాయతీలో బుధవారం రైతులకు ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. విత్తనాలు కొనే కంపెనీ పేరు, లాట్ నంబరు, గడువు తేదీ సరి చూసుకొని.. తీసుకున్న రసీదు భద్రపర్చుకోవాలని సూచించారు. కార్యదర్శి రాజు తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలి

ముధోల్: విత్తనాల కొనుగోలులో రైతులు జాగ్రత్తలు పాటించాలని ఏఈవో సిరాజ్ అన్నారు. బుధవారం మండలంలోని గన్నోరా, విఠోలి, విఠోలితండా గ్రామాల్లో రైతులకు విత్తనాల కొనుగోలుపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు విత్తనాలను కొనేటప్పుడు తప్పనిసరిగా రసీదు తీసుకోవాలన్నారు.

కుంటాల: విత్తనాలు, ఎరువుల ఎంపికలో రైతులు జాగ్రత్త వహించాలని ఏఈవో గణేశ్ సూచించారు. బుధవారం మండలంలోని కల్లూర్ ముద్దోల్లకుంటలో ఉపాధి పనులు చేస్తున్న రైతులకు నకిలీ విత్తనాలపై అవగాహన కల్పించారు. రైతులు లాట్ నెంబర్, విత్తన ప్యాకెట్‌ను దిగుబడి చేతికి వచ్చే వరకు భద్రపరుచుకోవాలని కోరారు. ఆయన వెంట ఎఫ్ఏ రాందాస్ ఉన్నారు.

తానూరు: విత్తనాల కొనుగోలు విషయంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని ఏఈవోలు సంఘవి, విష్ణు సూచించారు. మండలంలోని సింగన్‌గాం, బెల్‌తరోడా గ్రామాల్లో బుధవారం రైతులకు విత్తనాల ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.వర్షాలు కురిసిన తర్వాతే విత్తనాలు విత్తుకోవాలన్నారు. విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈవో గణేశ్

సాగులో మెలకువలు పాటించాలి

భైంసారూరల్: రైతులు సాగులో మెలుకువలు పాటించాలని ఏఈఓ స్వప్న అన్నారు. బుధవారం మండలంలోని ఎగ్గాం గ్రామంలో రైతులకు వేసవి దుక్కులు, సేంద్రియ ఎరువుల వినియోగం, పంట మార్పిడి విధానంపై అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్యదర్శి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.


నర్సాపూర్(జి): అవగాహన కల్పిస్తున్న ఏఈఓ రమ్య


భైంసారూరల్: ఎగ్గాంలో మాట్లాడుతున్న ఏఈఓ

బీడీ కార్మికుల సంబురాలు

సోన్: మండలంలోని న్యూబొప్పారం, కడ్తాల్ గ్రామాల్లో వివిధ కేటగిరిల్లో పని చేస్తున్న బీడీ కార్మికులు బుధవారం సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.రాజన్న మాట్లాడుతూ కార్మికుల సమష్టి కృషి ఫలితంగా వేతనాలు పెరిగాయన్నారు. వ్యవసాయం తర్వాత ఎక్కువ మందికి ఉపాధినిచ్చేది బీడీ పరిశ్రమ అని పేర్కొన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం ఆంక్షల్లేకుండా జీవన భృతి అందించి బీడీ కార్మికులను ఆదుకోవాలని కోరారు. అనంతరం రాజన్నను కార్మికులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు కె.లక్ష్మీ, జనార్దన్, గంగాధర్, ముత్తవ్వ, రజియా, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.


న్యూబొప్పారంలో సన్మానిస్తున్న నాయకులు

కెనాల్ లైనింగ్ మరమ్మతులెన్నడో?


మండల కేంద్రంలోని దేవునిచెరువు సమీపంలో దెబ్బతిన్న లైనింగ్

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని కాళేశ్వరం 27వ ప్యాకేజీ కెనాల్ లైనింగ్ గతేడాది వర్షాలకు గండ్లు పడి దెబ్బతింది. 10 నెలలు గడుస్తున్నప్పటికీ నీటిపారుదలశాఖ అధికారులు లైనింగ్ (సిమెంటు) పనులు చేపట్టలేదు. మరో పది రోజుల్లో వర్షాకాలం ప్రారంభమవుతుంది. అధికారులు స్పందించి లైనింగ్ దెబ్బతినకుండా మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

నర్సరీల్లోని మొక్కలకు నీరందించాలి

లోకేశ్వరం: నర్సరీల్లోని మొక్కలు ఎండిపోకుండా నీరందించాలని ఎంపీడీవో సోలమాన్‌రాజ్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో తాగు నీటి సమస్య లేకుండా చూడాలన్నారు. ఇంకుడుగుంతల నిర్మాణాలను పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఏపీవో జగన్నాథ్, ఈసీ అనిల్, టీఏలు, కార్యదర్శులు ఉన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీవో సోలమాన్‌రాజ్

'బీఆర్ఎస్ చేసిందేం లేదు'

ఉట్నూర్‌రూరల్: పదేళ్ల అధికారంలో ఉండి బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి చేసింది ఏమీ లేదని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. బుధవారం ఉట్నూర్ క్యాంప్ కార్యాలయంలో మాట్లాడారు. రైతులపై లాఠీచార్జి జరిగిందంటూ కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఆగస్టు 15 లోపు రుణమాఫీ చేస్తామన్నారు. నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీ అభ్యర్థి సుగుణ, ఖయ్యుం పాల్గొన్నారు.

పారిశుధ్యంపై పట్టింపేది?





జిల్లాకేంద్రంలోని ఇంద్రానగర్ కాలనీలో డ్రెయినేజీలు మురుగునీటితో నిండిపోయాయి. పూడిక తీయకపోవడంతో మురుగునీరంతా రోడ్డుపై పారుతోంది. దీంతో కాలనీవాసులు, వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి డ్రెయినేజీల్లో పూడిక తొలగించి.. అవసరమైన చోట మురుగుకాల్వలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

అటెన్షన్ ప్లీజ్.. ప్రమాదకర గుంత పూడ్చరూ..



కుభీర్: మండల కేంద్రంలోని మహాలక్ష్మీ ఆలయం వద్ద తహసీల్దార్ కార్యాలయం వెళ్లే మార్గంలో భగీరథ పైపులైన్‌కు లీకేజీ ఏర్పడగా.. మరమ్మతులు చేసేందుకు గుంత తవ్వి వదిలేశారు. గత రెండు నెలలుగా మరమ్మతులు చేపట్టడం లేదు.. గుంత పూడ్చడం లేదు. దీంతో రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా పైపులైన్‌కు మరమ్మతులు చేసి గుంత పూడ్చివేయాలని కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: రాజన్న, మిషన్ భగీరథ ఏఈ, ఫోన్: 99638 79579

వ్యక్తికి గాయాలు

తాంసి: భీంపూర్ మండలం అంతర్గాం గ్రామానికి చెందిన అశోక్ ఆదిలాబాద్‌కు పని నిమిత్తం బైక్‌పై వచ్చి తిరిగి ఇంటికి వెళ్తుండగా సావర్గాం గ్రామ శివారులో బైక్ అదుపు తప్పడంతో కింద పడ్డాడు. వెంటనే స్థానికులు గమనించి క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించారు.